క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ కార్యాలయం కూల్చివేత దారుణం

పెనుగొండ: తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ పార్టీ కేంద్ర కార్యాలయాన్ని కూల్చడం దారుణమని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్యదర్శి కొనుకు శ్రీనివాసరావు(జెంట్రీ) విమర్శించారు. ఆదివారం పెనుగొండలో విలేకరులతో మాట్లాడుతూ విజయాన్ని కక్ష సాధింపుచర్యలకు వినియోగించుకోకుడదన్నారు. అన్ని అనుమతులు తీసుకుని కట్టిన భవనాన్ని, కోర్టు ఉత్తర్వులకు భిన్నంగా కూల్చివేయడం కక్ష సాధింపు చర్యేనన్నారు. ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని, కూటమి ప్రభుత్వం తీరు మార్చుకోవాలని హితవు పలికారు.

రేపు వీఆర్ఏల జిల్లా సమావేశం

పెనుగొండ: వీఆర్ఏల జిల్లా స్థాయి సమావేశం ఈ నెల 25వ తేదీన పాలకొల్లు ఏఎంసీలో నిర్వహించనున్నట్లు వీఆర్ఏల ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బి గణేశ్వరరావు తెలిపారు. ఆదివారం పెనుగొండలో మాట్లాడుతూ మధ్యాహ్నం ఒంటిగంటకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. వీఆర్ఏల డిమాండ్లు, సమస్యలు పరిష్కరించేందుకు చర్చిస్తామని న్నారు. ఉమ్మడి జిల్లాల్లోని అన్ని డివిజన్లు, మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు అందరూ హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

29న జాతీయ లోక్ అదాలత్

నరసాపురం: నరసాపురం కోర్టు ఆవరణలో ఈ నెల 29న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, 10వ అదనపుజిల్లా జడ్జి పి.విజయదుర్గ చెప్పారు. ఆదివారం ఆమె విలేకరులతో అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుదాయని చెప్పారు. రాజీ చేసుకోదగిన సివిల్, క్రిమినల్ అన్ని కేసులు పరిష్కరించుకోవచ్చని చెప్పారు. న్యాయవాదులు, పోలీసులు సహకరించి వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించుకునే విధంగా కక్షిదారులకు అవగాహన కల్పించాలని కోరారు.

పందులు, పశువులను రోడ్లపైకి వదిలితే చర్యలు

నరసాపురం: పట్టణంలో రోడ్లపై పశువులు, పందులు తిరుగుతున్నట్టుగా ఫిర్యాదులు వస్తున్నాయని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. యజమానులు పందులు, పశువులను రోడ్లపైకి వదిలితే మున్సిపల్ ప్రజారోగ్య చట్టం ప్రకారం యజమానులపై చర్యలు తీససుకుంటామని హెచ్చరించారు. పందులు, పశువులను వేరే ప్రాంతాలకు తరలించడంతో పాటుగా భారీగా జరిమానాలు విధిస్తామని పేర్కొన్నారు. పందులు, పశువులు రోడ్లపైకి రాకుండా కట్టడి చేసుకోవాలని వివరించారు.

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



వడలిలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పెనుగొండ: అఖండ భారత దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన గొప్ప దేశ భక్తుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జి అని పెనుగొండ మండల బీజేపీ అధ్యక్షుడు దొడ్డిపట్ల నాగూర్ కొనియాడారు. ఆదివారం వడలిలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మొక్కలు నాటారు. చిన్న వయసులోనే మొట్టమొదటి న్యాయవాద వృత్తిని చేపట్టి, స్వాతంత్ర్యం అనంతరం నూతన మంత్రి వర్గంలో పరిశ్రమలు, విద్యా శాఖ మంత్రిగా పని చేశారన్నారు. కార్యక్రమంలో పడాల విష్ణు, బొబ్బిలి సత్యనారాయణ, గంటా నాగేశ్వరరావు, ఎల్లా సాయి ముత్యాల సురేష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం



బీవీఆర్ కళా కేంద్రంలో నెలవారీ సత్కారం చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ: పట్టణంలోని బీవీఆర్ ఆధ్వర్యంలో కళాకారుల నెలవారీ కార్యక్రమాలు అభినందనీయమని పలువురు ప్రముఖులు కొనియాడారు. ఆదివారం సాయంత్రం బీవీఆర్ కళాకేంద్రంలో వ్యవస్థాపక అధ్యక్షులు బుద్ధాల వెంకట రామారావు అధ్యక్షతన నెలవారీ సంగీత, నృత్య, సాహితీ, సాంస్కృతిక సమాహారం నిర్వహించారు. కళాకారుల ద్వారా ట్రాక్ సింగింగ్, నాట్యాచారిణి శ్రీలతచే కూచిపూడి నృత్య ప్రదర్శన, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు వంగపండు రామ్మోహన్‌రావుకు గౌరవ సేవ పురస్కారం, నాట్యాచారిణి ఎ.శ్రీలతకు నాట్యమయూరి పురస్కారం, హాస్యనటులు ఎన్.గంగాధరరావుకు ఆర్థిక సత్కారం చేశారు.

విద్యార్థులు కలలను సాకారం చేసుకోవాలి



జ్ఞాపికలను అందుకున్న విద్యార్థినులతో ట్రస్ట్ బోర్డు సభ్యులు

మొగల్తూరు: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ సూచించినట్లుగా విద్యార్థులు కన్న కలలు సాకారం చేసుకునేందుకు కష్టపడాలని నరసాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి వెంకటరమణ సూచించారు. మొగల్తూరు మండలంలోని పేరుపాలెం నార్త్ పంచాయతీ ఏటిమొండికి చెందిన వీర సీతారామరాజు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మొగల్తూరులో అందే బాపన్న జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ ఏడాది పదోతరగతి పరీక్షల్లో 450 పైగా మార్కులు సాధించిన 50 మంది అగ్నికుల క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థినులకు రూ.2 వేలు నగదు, జ్ఞాపికలను అందజేశారు. అనంతరం పదోతరగతి అనంతరం ఇంటర్, డిగ్రీ చదివే ఆర్థిక స్థోమత లేని 10 మంది విద్యార్థినులను డిగ్రీ వరకు చదివించేందుకు నిర్ణయం తీసుకున్నారు. అంతేకాక ఐఐటీలో సీటు సాధించిన కొల్లాటి రవి చంద్రికను, సన్మానించి రూ.5 వేలు నగదు, జ్ఞాపికను, ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన పొన్నమండ నవ్యశ్రీకు రూ.10 వేలు నగదు, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ బర్రి కృష్ణమోహన్ దంపతులు, వైస్‌చైర్మన్ బర్రి సీతారామరాజు, జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ, నాయకులు కటికల సూర్యారావు, రేవు రాంబాబు, వైస్ ఎంపీపీ కైలా సుబ్బారావు, ఉపాధ్యాయుడు దొంగ చింతయ్య తదితరులు పాల్గొన్నారు.

ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత



పెనుమంట్రలో ధ్యానంపై శిక్షణ ఇస్తున్న బండి శ్రీనివాసరాజు

పెనుమంట్ర: ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత పొందవచ్చని హైదరాబాద్‌కు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ బండి శ్రీనివాసరాజు అన్నారు. పెనుమంట్ర గ్రామంలో భూపతిరాజు వెంకటపతిరాజు సాయిగీతలు నిర్మించిన బ్రహ్మర్షి పత్రీజి పిరమిడ్ ధ్యానమందిరంలో హైదరాబాద్‌కు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ బండి శ్రీనివాసరాజు ధ్యాన శిక్షణ శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ధ్యానం అనేది మానవుడిని మాధవుడిగా తయారు చేస్తుందని, ధ్యానం చేయడం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత పరస్పర అవగాహన పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా పీఎస్ఎస్ఎం అధ్యక్షుడు మేకా వెంకటేశ్వరరావు, మధురామకృష్ణ, సతీష్, చక్రపాణి, బి.శ్రీదేవి, యర్రాయమ్మ, భ్రమరాంబ, తులసమ్మ, మార్తాండకుమారి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

మిగిలిన ఆహార పదార్థాలు వృథా చేయవద్దు



వడలిలో ఆహార పదార్థాలు పంపిణీ చేస్తున్న అక్షయ పాత్ర సభ్యులు

పెనుగొండ: మిగిలిన ఆహార పదార్థాలు వృథా చేయకుండా అన్నార్థులకు అందించాలని అక్షయ పాత్ర సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం సిద్ధాంతం గ్రామానికి చెందిన నాదేండ్ల మురళీకృష్ణ నివాసంలో జరిగిన కార్యక్రమంలో మిగిలిన ఆహార పదార్థాలు వృథా కాకుండా వడలి గ్రామానికి చెందిన అక్షయ పాత్రకు సమాచారం అందించడంతో వాటిని తీసుకువచ్చి వడలి ఎన్టీఆర్ కూడలిలో పేదలకు పంపిణీ చేశారు. సమాచారం అందించి అన్నార్తులకు అండగా నిలిచిన గోకవరపు రాజాకు అక్షయ పాత్ర కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు ఉప్పలపాటి చంటి, మేకా సురేష్, మేకా నరసింహ మూర్తిలు పాల్గొన్నారు.

రంగస్థల నటి గుమ్ములూరి సీత మృతి



గుమ్ములూరి సీత

పాలకొల్లు అర్బన్: ప్రముఖ రంగస్థల నటి గూడూరి సీతామహాలక్ష్మి (గుమ్ములూరి సీత) (65) ఆమె స్వగ్రామమైన గుమ్ములూరులో సోదరుని ఇంటి వద్ద ఆదివారం మృతి చెందారు. ఆమె 13 ఏళ్ల వయస్సు నుంచి రంగస్థలంపై అనేక సాంఘిక, పౌరాణిక పాత్రలు పోషించి ప్రేక్షకులను మెప్పించారు. పట్టణానికి చెందిన దివంగత వరద కోటేశ్వరరావు, కడలి వెంకట నరసింహారావు టీమ్‌లో చిల్లరకొట్టు చిట్టెమ్మ, సాయిబాబా మహత్యం, బాల నాగమ్మ, శివలీలలు, సత్యహరిశ్చంద్ర తదితర నాటకాల్లో పలు పాత్రలు పోషించారు. అలాగే నంది నాటకోత్సవాల్లో కూడా పాల్గొని తన నటనతో ప్రేక్షకులను మెప్పించారు. ఆమె వివాహం చేసుకోలేదు. సుగర్ వ్యాధితో బాధపడుతూ సోదరుడు ఇంటివద్ద ఉంటూ తుది శ్వాస విడిచారు. ఆమె మృతిపై నటీనట సంక్షేమ సమాఖ్య కార్యనిర్వాహక అధ్యక్షుడు తాళాబత్తుల వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి గుడాల హరిబాబు, పాలకొల్లు కళా పరిషత్ అధ్యక్షుడు మానాపురం సత్యనారాయణ తదితరులు సంతాపం తెలిపారు.

బకాయి వసూళ్లలో కలవపూడి సొసైటీ ముందంజ

కాళ్ల: కలవపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో 2023–24 సంవత్సరానికిగాను రైతుల నుంచి రావాల్సిన బకాయిలను నూరు శాతం వసూలు చేసినట్లు కలవపూడి సొసైటీ సీఈవో కనుమూరి నరసింహరాజు (మణి) తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో సంఘ సభ్యుల నుంచి రావాల్సిన మొత్తం సుమారు రూ.5.98 కోట్లు వసూలు చేసినట్లు తెలిపారు. గత 14 ఏళ్లుగా జిల్లాలో సహకార సంఘాల కంటే ముందుగా రికవరీ చేసి ఆదర్శ సంఘంగా నిలిచిందన్నారు. బకాయి వసూళ్లకు సహకరించిన జిల్లా సహకార సంఘ సిబ్బందికి, రైతులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

పుష్కర ఘాట్‌లు అధ్వానం



శిథిలావస్థకు చేరిన కొండాలమ్మ గుడి ప్రాంతంలో నిర్మించిన రేవు

నరసాపురం: పట్టణంలోని గోదావరిగట్టు పొడవునా నిర్మించిన పుష్కరఘాట్ రేవులు పర్యవేక్షణ లేకపోవడంతో శిథిలమై అధ్వాన స్థితికి చేరాయి. కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా అయ్యింది. 2015 గోదావరి పుష్కరాల సమయంలో గోదావరి గట్టు పొడవునా పలు చోట్ల పాతరేవుల అభివృద్ధి, కొన్నిచోట్ల కొత్తరేవుల నిర్మించారు. అయితే అప్పట్లో కొన్నిచోట్ల అవసరం లేని ప్రదేశాల్లో కూడా రేవులను దీంతో పుష్కరాల తరువాత జనం వెళ్లని రేవుల పరిస్థితిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. రేవులు కట్టాక ఆయా ప్రాంతాల వద్దకు ప్రజలు వెళ్తున్నారు. కానీ వలంధర్‌రేవు, అమరేశ్వరఘాట్, లలితాంబఘాట్ ఘాట్ తప్పిస్తే మిగిలినచోట్ల నిర్మించిన రేవులు శిథిలమయ్యాయి. మున్సిపల్ అధికారులు కూడా మిగిలిన రేవుల మరమ్మతుల వంటి అంశాలు పట్టించుకోకపోవడంతో పరిస్థితి దారుణంగా తయారైంది.

ముగిసిన అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాలు



సుంకరపాలెంలో అభయాంజనేయస్వామి పల్లకీ ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

యలమంచిలి: గుంపర్రు పంచాయతీ సుంకరపాలెంలో ఉన్న శ్రీ వరసిద్ధి వినాయక, సుబ్రహ్మణ్య ప్రయుక్త శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయం వద్ద ఉన్న ధ్వజ స్తంభానికి ఇత్తడి కవచం తొడిగారు. ఆలయ అర్చకులు వేదాంతం సుబ్రహ్మణ్యం బ్రహ్మత్వంలో మానేపల్లి సత్యనారాయణ (చిన్నబాబు) ఆధ్వర్యంలో ఈ వేడుకలు శాస్త్రోక్తంగా నిర్వమించారు. గ్రామానికి చెందిన రిటైర్డ్ డీవైఈఓ కొంపెల్ల వెంకట సూర్య సత్యనారాయణమూర్తి సహకారంతో ఈ ఇత్తడి కవచం ఏర్పాటు చేశారు. ఇత్తడి కవచం తొడిగిన అనంతరం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఉంచి సన్నాయి మేళం, బాణాసంచా కాల్పుల మధ్య గ్రామోత్సవం చేశారు. రాత్రి జరిగిన అన్నసమారాధనతో వార్షికోత్సవాలు ముగిశాయి.

మార్టేరు సర్పంచ్ మట్టాకుమారికి సేవా పురస్కారం



మార్టేరు సర్పంచ్ మట్టాకుమారికి సేవా పురస్కార్ అవార్డు ఇచ్చి సత్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

పెనుమంట్ర: మార్టేరు గ్రామ సర్పంచ్ మట్టాకుమారికి విశ్వమాత మదర్‌థెరిస్సా, రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ సేవా పురస్కార్ అవార్డును ఆదివారం అందజేశారు. పి.గన్నవరానికి చెందిన మమతా స్వచ్ఛంద సేవా సమితి ఆధ్వర్యంలో మదర్‌థెరిస్సా హెల్పింగ్ అసోసియేషన్ కార్యాలయంలో అసోయేషన్ అధ్యక్షుడు కర్రి మురళీశ్రీనివాసరెడ్డి చేతులు మీదుగా అవార్డును సర్పంచ్‌కు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా మురళీశ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మార్టేరు గ్రామాభివృద్ధికి సర్పంచ్ మట్టాకుమారి విశేషంగా కృషి చేశారని, భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంస్థ అధినేత కోరుకొండ జాన్, డాక్టర్ సాకా రాజు, ఉపాధ్యక్షులు సక్కా నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ జాతర మహోత్సవాలు ప్రారంభం



మావుళ్లమ్మకు 6 గ్రాముల బంగారాన్ని విరాళంగా అందజేస్తున్న భక్తులు

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక రామరాజుతోటలో వేంచేసియున్న మావుళ్లమ్మ 39వ జాతర మహోత్సవాన్ని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడి, కమిటీ నాయకులను అభినందించారు. జాతర మహోత్సవంలో కళా బృందాలు ప్రదర్శించిన శక్తి వేషాలు, డప్పు వాయిద్యాలు, కేరళ వాయిద్య బృందాలు, బుట్ట బొమ్మలు, కోయ డాన్సులు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో పంజా లక్ష్మణరావు, రామాయణం సుధీర్, మావూరి సుందర్రావు, కోరసిక వెంకటేశ్వరరావు, అల్లు శ్రీనివాసులు పాల్గొన్నారు.

బంగారం సమర్పణ

మావుళ్లమ్మకు భక్తులు బంగారాన్ని సమర్పించుకున్నారు. ఆదివారం మావుళ్లమ్మను దర్శించుకున్న నెల్లూరుకు చెందిన పి.వంశీకృష్ణ, రమలు 6 గ్రాముల బంగారాన్ని విరాళంగా అందజేసినట్లు ఆలయ సహాయ కమీషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ఉప ప్రధాన అర్చకులు కొప్పేశ్వరరావు పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారి తీర్థ ప్రసాదాలను దాతలకు అందజేశారు.

ముత్యాలమ్మ ఆలయానికి భక్తుల తాకిడి



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్నశ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. అమ్మవారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఈఓ డి.రామకృష్ణంరాజు, ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

డ్రెయిన్ల ప్రక్షాళన వేగవంతం



డ్రెయిన్‌లో పూడిక తీస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

ఆకివీడు: పట్టణంలోని పలు ప్రాంతాల్లో డ్రెయిన్లలో పూడిక తీత పనుల్ని వేగవంతం చేశారు. వర్షాలు కురవడంతో ఆయా డ్రెయిన్లలో చెత్త పేరుకుపోయి, ముంపు ప్రమాదం ఉందని నగర పంచాయతీ పాలకవర్గం విస్తృత స్థాయిలో డ్రెయినేజీలను శుభ్రం చేయిస్తున్నారు. ప్రధాన డ్రెయిన్లు గంగానమ్మకోడు, అందేవారి బోదె, మూలలంక బోదెలలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు, పూడిక మట్టిని తొలగిస్తున్నారు. అదే విధంగా వీధుల్లోనూ, రైల్వేస్టేషన్ వద్ద, ఇతర ప్రాంతాల్లో ప్రధాన డ్రెయిన్లలో పేరుకుపోయిన వ్యర్థాల్ని తొలగిస్తోన్నారు. దుక్కి వర్షానికే పలు వీధులు జలమయమవుతోన్నాయి. వేసవిలో ఉపయోగించిన పాలిథిన్ వ్యర్థాలతో డ్రెయిన్లు పూడుకుపోతున్నాయి. దీంతో నీటి ప్రవాహానికి తీవ్ర ఇబ్బంది ఏర్పడుతుంది. రానున్న రోజుల్లో వర్షాలు అధికంగా కురుస్తాయని ప్రకటించడంతో నగర పంచాయతీ అప్రమత్తమయ్యింది. చైర్‌పర్సన్ హైమావతి, కమిషనర్ జీ.కృష్ణమోహన్, కౌన్సిలర్లు డ్రెయినేజీల శుభ్రంపై చర్యలు చేపట్టారు.

సీపీఎం విస్తృత స్థాయి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జుత్తిగ నరసింహమూర్తి

వీరవాసరం: ప్రభుత్వ కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం మండల కమిటీ విజ్ఞప్తి చేసింది. ఆదివారం నౌడూరు జంక్షన్‌లో సీపీఎం కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం అయినాపూడి బాబురావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న సీపీఎం నాయకుడు జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ మత్స్యపురి పాలెం, ఉత్తర పాలెం, తలతాడితిప్ప కాలనీల్లో అధికారులు తక్షణం పర్యటించాలని కోరారు. అండలూరు, మడుగు పోలవరం గ్రామాల కాలనీలలో సంబంధిత అధికారులు ఆయా గ్రామ సర్పంచులు పర్యటించాలని విజ్ఞప్తి చేశారు. మండల కార్యదర్శి పోతుల మృత్యుంజయ భవిష్యత్తు కర్తవ్యాలు వివరించారు. కార్యక్రమంలో యాల్ల బండి నారాయణమూర్తి, జుత్తిగ శ్రీనివాస్, లింగం సత్యనారాయణ, తాళ్లూరు రాము, తదితరులు పాల్గొన్నారు.

మానవత సంస్థ కార్యవర్గ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న బుద్ధరాజు వెంకటపతి రాజు

భీమవరం: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, భీమవరం మండలశాఖ వార్షిక కార్యవర్గ సమావేశం గాంధీ కస్తూరిబా సేవా సంఘ భవనంలో ఆదివారం నిర్వహించారు. మానవత విస్తరణ కమిటీ కన్వీనర్ సాగిరాజు జానకిరామ రాజు ముఖ్య అతిథిగా విచ్చేయగా, బుద్ధరాజు వెంకటపతిరాజు అధ్యక్షత వహించారు. ఏడాది కాలంగా నిర్వహించిన సేవా కార్యక్రమాల నివేదికను సమర్పించారు. 2024–25 నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం, వెయ్యి మంది సభ్యులతో భీమవరం శాఖను విస్తృత పరచడం కోసం తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కారుమూరి నరసింహమూర్తి (బాబు), డైరెక్టర్లు ఇందుకూరి ప్రసాదరాజు, వబిలిశెట్టి వెంకటేశ్వరరావు, చేకూరి ఝాన్సీ, అల్లు శ్రీనివాసు పాల్గొన్నారు.

ముమ్మరంగా పూడికతీత పనులు



వెంకయ్య వయ్యేరు పంట కాల్వలో పూడికలు తొలగిస్తున్న దృశ్యం

ఆకివీడు: వెంకయ్య వయ్యేరు పంట కాల్వలో పూడికతీత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలోని కలవపూడి గ్రామ రైతులు రెండు ప్రొక్లెయినర్లతో పూడిక, గుర్రపుడెక్క తొలగిస్తున్నారు. కాలువలకు నీరు వదలి నెల రోజులు కావస్తున్నా నేటికీ కాలువల్లోకి నిండుగా నీరు ప్రవేశించ లేదు. అరకొరగా నీరు విడుదలతో శివారు ప్రాంతాలకు నీరందడం లేదు. ఆకివీడు నుంచి ఏలూరుపాడు వంతెన వరకూ వెంకయ్య వయ్యేరు పంట కాల్వలో సుమారు రూ.25 కోట్లతో బెడ్ కాంక్రీట్ నిర్మాణం చేశారు. దీంతో పదేళ్లుగా కాలువలో పూడుకుపోయిన మట్టిని తొలగించలేదు. నీటి ప్రవాహం వేగంగా ఉంటే మట్టి కొట్టుకుపోయే అవకాశం ఉంది. అయితే నీటి ప్రవాహం అంతంత మాత్రంగానే ఉండటం, ఆయా గ్రామాల్లోని ప్రజలు చెత్త చెదారం, వ్యర్థాల్ని కాలువలో పారవేయడంతో పూడికలు భారీగా పెరిగిపోయాయి. దీంతో నీటి ప్రవాహం మందగించింది. శివారు ప్రాంతాలకు సాగునీరందాలంటే కాలువలోకి కనీసం 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో నీటి అవసరాలు పెరిగాయి. కాలువ ఎగువ భాగంలోనే నీటిని అధికంగా తోడేయడం, సన్నా, చిన్న, మధ్య కాలువలకు వదిలి వేయడంతో ఆకివీడు మండలంలోని చెరుకుమిల్లి, అయిభీమవరం, కాళ్ల మండలంలోని పలు గ్రామాలకు సాగునీరందడం లేదు. పూడికలు తొలగించేందుకు ఓఅండ్ఎం నిధులు కేటాయించాల్సి ఉంది. అయితే కడా సంస్థ నేటికీ నిధులు విడుదలకు అనుమతులు ఇవ్వకపోవడంతో రైతులే కాలువల్ని బాగు చేసేందుకు ముందుకు వచ్చారు.

బెడ్ కాంక్రీట్ దెబ్బతింటే..

వెంకయ్య వయ్యేరు పంట కాల్వలో బెడ్ కాంక్రీట్ ప్రొక్లయినర్లతో దెబ్బతినే అవకాశం ఉందని ఆయా ప్రాంతాల రైతులు పేర్కొంటున్నారు. బెడ్ కాంక్రీట్ దెబ్బతింటే రానున్న రోజుల్లో నీటి ప్రవాహానికి మరింత ఆటంకం ఏర్పడే ప్రమాదం ఉందంటున్నారు. బెడ్ కాంక్రీట్ దెబ్బతినే అవకాశం ఉన్నందున ప్రత్యామ్నాయ మార్గాలతో కాలువలో పూడిక తీయిస్తే బాగుండేదని రైతులు కోరుతున్నారు. కాలువలో పూడిక తీత పనుల సమయంలో సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులెవరూ దగ్గర లేరు.

అరుణాచల యాత్రతో ఆధ్యాత్మిక అనుభూతి



ఆర్టీసీ బస్సు ద్వారా అరుణాచలం గిరి ప్రదక్షిణ యాత్ర అనంతరం పట్టణానికి చేరుకున్న భక్తులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీఎస్ఆర్టీసీ తాడేపల్లిగూడెం బస్టాండ్ నుంచి అరుణాచలం గిరి ప్రదక్షిణకు సూపర్ లగ్జరీ వీడియో కోచ్ బస్సు యాత్రతో ఆధ్యాత్మిక అనుభూతి పొందామని భక్తులు పేర్కొన్నారు. జూన్ 20న గురువారం సాయంత్రం డిపో నుంచి అరుణాచల గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బస్సు భక్తులతో బయలుదేరి, మార్గంలో శ్రీకాళహస్తి, కాణిపాకం విఘ్నేశ్వర స్వామి క్షేత్రానికి, శ్రీపురం శ్రీ మహాలక్ష్మి గోల్డెన్ టెంపుల్ క్షేత్రాలను దర్శించిన అనంతరం బస్సు ఆదివారం తాడేపల్లిగూడెం చేరింది. ఆర్టీసీ ట్రాఫిక్ ఇంచార్జి కె.సురేష్‌బాబు, గ్యారేజీ ఇన్‌చార్జి చిట్టిబాబు, ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ప్రయాణికులు ఎం.జయలక్ష్మి, ఎస్.వాణి, బి.వెంకన్న తదితరులు యాత్ర అనుభవాలను పంచుకున్నారు. గిరి ప్రదక్షిణ, పుణ్యక్షేత్రాలు దర్శించేందుకు చక్కటి అవకాశం కల్పించిన ఆర్టీసీ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. పౌర్ణమి రోజున గిరి ప్రదక్షిణ ద్వారా పుణ్య ఫలం లభించిందని చెప్పారు. బస్సు కండిషన్ బాగాందని, నైపుణ్యం ఉన్న డ్రైవర్లను ఏర్పాటు చేశారని, గైడ్‌గా వ్యవహరించారని అభినందించారు. అంతేగాక వచ్చే నెల జూలై 19వ తేదీన పౌర్ణమి గిరి ప్రదక్షిణకు బయలుదేరే అరుణాచలం ప్రత్యేక సర్వీస్ చార్జీ కేవలం రూ.2600 మాత్రమేనని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కూడా ఏర్పాటు చేశామని, మరిన్ని వివరాలకు 99592 25488, 99597 53102, 99855 44411 నెంబర్లకు ఫోన్ చేయాలని డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ మూర్తి విజ్ఞప్తి చేశారు.

సంచార వైద్యశాలలో వృద్ధులకు వైద్య సేవలు

తణుకు టౌన్ : తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటికి వైద్యసేవల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆరుగురు వృద్ధులకు వైద్య సేవలు అందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ.కరుణాకర్ చౌదరి తెలిపారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా జనరల్ వైద్యులు సుంకవల్లి నీలు మహేంద్ర, తణుకు పట్టణం, సజ్జాపురం, దువ్వ, పరిసర గ్రామాల్లోని మంచంపై నుంచి లేవలేని వృద్ధులకు వైద్య పరీక్షలు చేసి, పలు సూచనలు, సలహాలు అందించారు. ఇండియా నెట్ వర్క్ ఫౌండేషన్ ద్వారా డాక్టర్ కేవీరావు ఆర్థిక సహాయంతో మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో కోశాధికారి ఆర్జి భాస్కర రావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నాదెళ్ల కృష్ణానందం, తదితరులు పాల్గొన్నారు.